


# అమ్మంటే.... అమ్మే

డా॥ కల్యాణి శ్యామల్

"నా కెందుకో మీరు పొరబడుతున్నా రనిపిస్తోంది!" అన్నాడు ప్రభు.

"నీకు తెలియదు, బాబయ్యా! నువ్విక్కడ నాలుగు రోజులుండి చూస్తే నీకే అర్థమవుతుంది. మేము మాత్రం ఊరికే ఎందుకంటాం? ఆ మాత్రం తెలియదా ఏమిటి?" పద్దెనిమిదేళ్ల రజని నిష్ఠూరంగా అంది.

"పిల్లలూ! ఆవిడ మీకు అమ్మ. నాకు అమ్మలాంటి వదిన. నా కెందుకో అలా ఆలోచించటమే తప్పనిపిస్తోంది. మీ అమ్మ చాలా స్ట్రైట్ థింకింగ్ అండ్ ప్లెయిన్ స్పీకింగ్ పర్సన్. తన మీద ఆధారపడిన వాళ్లగురించే తప్ప తన గురించి ఎప్పుడూ ఆలోచించుకోదు!"


"అందరూ అలాగే అనుకుంటారు. మేమూ మొన్నటిదాకా అలా అనుకున్నవాళ్లమే! ఇన్నాళ్లూ తన గురించి అసలు ఆలోచించలేదో, లేకపోతే సరిగ్గా అంచనా వేయలేదో, అమ్మ మాత్రం ఇదివరకటిలా లేదు. ఎందుకూ, నువ్వే చూస్తావుగా కాసేపట్లో!" ప్రసన్న అన్నాడు. వాడికి పదిహేనేళ్లు. టెన్త్ పరీక్షలు రాయబోతున్నాడు.

"సరే, చూద్దాం! వెళ్లి చదువుకోండి!" అంటూ పేపరు పఠనంలో పడ్డాడు ప్రభు.

పిల్లలిద్దరూ లేచి వాళ్ల గదుల్లోకి జారుకున్నారు చదువుకోడానికి.

000

పిల్లలిద్దరికీ ఏదో సర్ది చెప్పి పంపించాడే కానీ, ప్రభు మనసంతా ఏమిటో గందరగోళంలా తయారైంది. ఇదెలా సాధ్యం? తల్లిలాంటి వదిన ... దేవతలాంటి వదిన .... ఛ!ఛ! ఎక్కడో ఏదో తిరకాసుంది. ఈ మిస్టరీ ఏదో తేలితే కానీ ఇక్కడ నుంచి కదలటానికి లేదు. పిల్లలిద్దరూ చాలా అప్సెట్ అయ్యారు. వాళ్ల పరిస్థితిలో ఉంటే ఎవరైనా అంతేనేమో! అసలు వదిన ఎందుకిలా చేస్తోంది? ఎలా కనిపెట్టాలి? డైరెక్టుగా అడిగితే నీకేమి




సంబంధం అని అటుందేమో! అడక్కపోతే పిల్లలు అన్యాయం అవుతారు. ఏం చెయ్యడం? చేతిలో పేపరు ఉందన్న మాటే కానీ దృష్టంతా ఎక్కడో ఉంది. ఆ ఆలోచనల్లో పడి బయట స్కూటరాగిన శబ్దం విననేలేదు.

శారద హడావుడిగా లోపలికొస్తోంది. వెనకాలే ఒక పాతిక, ముప్పై ఏళ్ల యువకుడు.

"కూర్చో, విశ్వం! ఇప్పుడే వస్తాను. వంటింట్లో పదిహేను నిమిషాల పని, తర్వాత వెళ్దాం!"

"త్వరగా రండి! మళ్లీ ఆయన వెళ్లిపోతే కష్టం!" అంటూ లోపలికి వచ్చిన విశ్వం డ్రాయింగ్ రూమ్‌లో కొత్త వ్యక్తిని చూసి ఆగిపోయాడు.

అతని వెనకే ముందు తలుపు వేసి వచ్చిన శారద ప్రభుని చూస్తూనే సంబరంగా, "ప్రభూ! ఎప్పుడు వచ్చావు? చెప్పనైనా లేదు వస్తున్నట్టు! సారీ, నువ్వొస్తున్నట్లు తెలిస్తే ఇంట్లోనే ఉండేదాన్నిగా! ఎంతసేపయింది వచ్చి? కాఫీ తాగావా?" ప్రశ్న వెనకాల ప్రశ్న గుప్పిస్తూ హడావుడిపడుతున్న శారదని చూడగానే ప్రభు ముఖంలో సంతోషం, రిలీఫ్, నిశ్చింత! 'అమ్మయ్య! వదినేం మారలేదు' అనుకుంటూ

"ఇప్పుడే ఒక గంటయింది వచ్చి. అనుకోకుండా బయలుదేరాల్సి వచ్చింది. మీకు తెలియపరిచే టైము లేకపోయింది. నువ్వు లేకపోతేనేం పరవాలేదులే, అమ్మాయి ఫస్ట్‌క్లాస్ కాఫీ ఇచ్చింది. తాగి, స్నానం చేసి కూర్చున్నాను. నువ్వేమిటి, చాలా బిజీగా ఉన్నట్టున్నావు? మళ్లీ ఎక్కడికైనా వెళ్లాలా?" విశ్వాన్ని నిశితంగా చూస్తూ అడిగాడు.

"అవును, వెళ్లాలనుకో ..." సందిగ్ధంగా అంటూ ఆగి, "అన్నట్టు ... మర్చేపోయాను, ఇతన్ని పరిచయం చెయ్యలేదు కదూ! మా ఆఫీసులో కొత్తగా చేరాడు. పేరు విశ్వమోహన్. ఇద్దరం కలిసి ఒక ప్రాజెక్టు స్టార్ట్ చేశాం. ఇతను మా మరిది, పేరు ప్రభూ!" విశ్వానికి కూడా పరిచయం చేసింది.

"అపాయింట్‌మెంట్ మార్చుకోగలమంటావా? రేపు వెళ్దాం, విశ్వం?" మళ్లీ అడిగింది.

"మార్చుకోవటం పెద్దసమస్య కాదుకానీ, మళ్లీ మనకే నష్టం. టైమ్ షెడ్యూల్ అంతా అప్సెట్ అవుతుంది. అయినా, మీ ఇష్టం!" అన్నాడు విశ్వం.

ప్రభు అన్నాడు "ఫర్వాలేదు, వదినా! వెళ్లాలంటే వెళ్లు! తొందరగా వచ్చేస్తావుగా! నేను భోజనం చేసి కాసేపు పడుకుని, నా పని చూసుకుని వస్తాను. అపుడు మాట్లాడుకుందాంలే!"

"అవునా, నువ్వూ బయటకు వెళ్లాలా? నేను రెండు గంటలకల్లా వచ్చేస్తాను. నువ్వేం అనుకోవుగా, ప్లీజ్!" అంటూ లోపలికి నడిచింది.

విశ్వం బల్లమీద పుస్తకం తీసుకుని తిరగేస్తూ కూర్చున్నాడు.

రజని, ప్రసన్న ఇద్దరూ వచ్చారు.

"హల్లో కిడ్స్! ఎలా ఉన్నారు ఇద్దరూ? ఈ రోజు మీ మమ్మీ ఏం సాధించిందో తెలుసా? నేను చెప్తే మజా లేదు, మీరు అడగండి. తనే చెప్తుంది!" నవ్వుతూ అంటున్న విశ్వంకేసి నిర్లిప్తంగా చూశారు పిల్లలిద్దరూ.

"సరే, అంకుల్! అలాగే అడుగుతాం. అమ్మ మళ్లీ మీతో బయటకి వెళ్తోందా?" రజని ముభావంగా అడిగింది.

"ఆఁ, ఒక గంటసేపే! మినిస్ట్రీలో ఒక జాయింట్ సెక్రటరీని కలవాలి. మీ అమ్మ ఇంట్లో పది నిమిషాలు పనుందంటే ఇలా వచ్చాం. మీ ఇద్దరూ ఇవాళ స్కూలు కెళ్లలేదేం?" అడిగాడు విశ్వం.

"వెళ్లలేదు. బాబయ్య వచ్చాడుగా! అమ్మ ఎలాగూ లేదు. మేము కూడా వెళ్లిపోతే తనకి బోరు కొడ్తుందిగా. అందుకే వెళ్లలేదు!" బాధ్యత వ్యక్తం చేసే గొంతుకతో అన్నాడు ప్రసన్న.

శారద హడావుడిగా వచ్చింది. "మీరిద్దరూ ఇంట్లోనే ఉన్నారా? స్కూలుకి ఎందుకు వెళ్లలేదు? సరే, కుక్కర్ పడేశాను. రజనీ! రెండు కూతలు రాగానే స్టౌ కట్టేయ్, తల్లీ! అన్నీ వేడివేడిగా వేసుకుని తినండి. నా కోసం ఆగద్దు. నేను వచ్చి తింటాను. నేను అర్జంట్‌గా ఒకచోటకి వెళ్లాలి. ప్రభూ! వస్తానయితే, సాయంత్రం కలుద్దాం!" మాట్లాడుతూనే హడావుడిగా బయటకు నడిచింది. వెనకాలే విశ్వం.

"ఇతనేనా?" ప్రభు అడిగాడు.

"ఆఁ, ఈ మహానుభావుడే!" కిటికీలోంచి వాళ్లిద్దర్నే చూస్తూ పళ్లు కొరుకుతూ అన్నాడు ప్రసన్న. చుట్టుపక్కల రెండు మూడు జతల కళ్లు వాళ్లింటిమీదే ఉంటాయని ఆ చిన్న మనసుకి ఖచ్చితంగా తెలుసు.

"అసలు పరిచయం ఎలా అయింది?" ప్రభు ప్రశ్న మళ్లీ.

"అమ్మకి ఆరునెలల క్రితం కాలు ఫ్రాక్చరై హాస్పిటల్‌లో ఉంది, చూడు! అప్పుడు ఇతను కూడా అప్పటికే ఏక్సిడెంట్ అయి హాస్పిటల్‌లో ఉన్నాడు, అమ్మ పక్క బెడ్‌మీదే జనరల్ వార్డులో. మేము సాయంత్రం విజిటింగ్ అవర్స్‌లో వెళ్లేవాళ్లం కదా! ఇతను అప్పటికే కొంత కోలుకోవటంతో అంత పూర్తిగా బెడ్‌మీద ఉండేవాడు కాదు. అమ్మకి మందులివ్వడం, నడిపించటం, కబుర్లు చెప్పి నవ్వించడం అన్ని సహాయాలూ చేశాడు. అయితే ఆ తర్వాత కూడా ఇలా తగులుకున్నాడు. అమ్మే వాళ్ల ఆఫీసులో ఉద్యోగం ఇప్పించింది. ఇక్కడే దగ్గర్లో పల్లెటూళ్లో తండ్రి భూకామందుట. బాగా డబ్బున్నవాడే! కాలక్షేపం ఉద్యోగం! కానీ, సిన్సియర్ అయినట్టు నాటకాలు!" రజని ఇంకా ఏదో చెప్పబోతుంటే ప్రభు చెయ్యి పైకెత్తి వారించాడు.

"రజనీ! నేను చూస్తానని చెప్పానా లేదా? నిజానిజాలు తెలుసుకోకుండా అందరినీ అలా నిందించకూడదు. తొందరపడకు! నువ్వింకా చిన్నదానివి. నీకు తెలియని విషయాలు కొన్ని ఉంటాయి. లేనిపోని ఊహలు చెయ్యకు. తమ్ముడు చూడు, ఎలా బెంబేలెత్తిపోతున్నాడో!" ప్రభు లాలనగా ఖచ్చితంగా చెప్పాడు.

"సరే, బాబయ్యా! నువ్వే చూస్తావుగా! మాకైనా పక్కింటత్తయ్యగారు చెప్పింది. నీకు ఉత్తరం రాయమని కూడా ఆవిడే చెప్పింది. అమ్మ మాత్రం ఇదివరకటిలా లేదు. అదిమాత్రం నిజం! మేము స్కూలు మానేస్తే ఎలా తిట్టేది? ఇప్పుడు చూశావా, అసలు రియాక్షనే లేదు!" రజని అంది.

"ఓకే, ఓకే! పదండి, అన్నాలు తిందాం! రజనీ! వెళ్లి గ్లాసులు పట్రా! బాబూ, నువ్వు కంచాలు పట్టుకురా! నేను గిన్నెలు, గరిటలు...!" సరదాగా నవ్వుతూ, నవ్విస్తూ అన్నాల కార్యక్రమం ముగించుకున్నారు ముగ్గురూ. ప్రభుకి మాత్రం ఏదో బాధ మెలిపెడుతూనే ఉంది.

000

భోంచేసి నడుము వాల్చిన ప్రభు మనస్సు గతంలోకి వెళ్లింది.

అన్నయ్య అయితే తమ కుటుంబంలో వాడే. తనకంటే పదిహేనేళ్లు పెద్దవాడు. వదిన అప్పుడే ఆ కుటుంబంలో ప్రవేశించినా, ఏ మాత్రం తేడా తెలియనిచ్చేది కాదు. అయితే ఖరాఖండిగా, ఖచ్చితంగా, నిర్మొహమాటంగా మాట్లాడటం అలవాటు. తనవల్ల ఏ అపార్థాలూ రాకుండా ఉండాలంటే ముందే అన్ని విషయాలూ స్వేచ్ఛగా చెప్పేస్తే తర్వాత గొడవలు రావన్న ఆలోచనే ఎప్పుడూ. 'అన్ని ఇళ్లల్లోలాగా మన ఇంట్లో అత్తా కోడళ్లు, వదినా ఆడబడుచుల మధ్య వాగ్వివాదాలు, యుద్ధాలూ జరగకూడదు. దానికి సరైన పద్ధతి మనసుల్లో ఏ కాస్త బాధనిపించినా పైకి చెప్పి, చర్చించుకుని సరిదిద్దుకోవడమే!' అని అస్తమానూ వివరిస్తూ ఉండేది. ఏ మాటకామాట, వదిన వల్ల ఎప్పుడూ ఎలాంటి జగడాలూ, బాధా ఎవరికీ కలగలేదు.

అలాంటి వదిన ఇవాళ తన పిల్లలు తనని అపార్థం చేసుకునే అవకాశం ఎందుకు రానిచ్చింది? అన్నయ్య పోయింతర్వాత పిల్లలు బాగా దగ్గరవడమే కాదు, తండ్రితో వాళ్లకున్న అనుబంధం వలననో ఏమిటో తనని చూడగానే అన్ని కష్టాలు ఏకరువు పెట్టేస్తున్నారు. ఇప్పుడు వాళ్ల బాధ వాళ్ల అమ్మ వాళ్లకి దూరమవుతున్నదని. వాళ్లని ఒక దారికి తేవాలి. ముందు ఈ విశ్వం అన్న శాల్తీ వ్యవహారమేమిటో కనుక్కోవాలి. ఇంటికి ఫోన్ చేసి రెండు రోజులయ్యాక వస్తానని చెప్పాలి. బుర్ర వేడెక్కిన ప్రభుకి అనుకోకుండా నిద్ర పట్టేసింది.

గంటలో వస్తానన్న శారద సాయంకాలం ఆరుగంటలకి ఇంటికి వచ్చింది.

"ఏమిటి వదినా! ఇదంతా పనే? తిండీ తిప్పలూ వదిలేశావా ఏమిటి?"

"వదిలివెయ్యగలిగితే బాగానే ఉంటుంది. మనిషన్న తర్వాత తినక తప్పదుకదా! మనుషులమైనందుకు తినాలంటే వండుకోవాలి కదా! కూర తెస్తాను, తరుగుతూ మాట్లాడుకుందాం!" నవ్వుతూ వంటింట్లోకి నడిచింది శారద.

కార్పెట్ మీద మధ్యలో కూర్చుని తరగటం మొదలుపెట్టింది. "ఇప్పుడు చెప్పు, ఏమిటి విశేషాలు? హఠాత్తుగా వచ్చేశావేమిటి, ఆఫీసు పనా?"

"ఆఫీసు పనీ, నిన్నూ పిల్లల్నీ చూడటంకూడా! నువ్వు చెప్పు, ఏమిటి అంత హడావుడి పడుతున్నావు. పొద్దున్న ఎప్పుడు వెళ్లావో ... మధ్యాహ్నం అన్నం కూడా తినలేదు. ఇంట్లో పని, వంటపని ఎలాగూ తప్పవు. ఉద్యోగంలో కూడా ఊపిరాడకుండా తిరుగుతున్నావు. ఒక్కోసారి పొద్దున్న వెళ్తే రాత్రిదాకా రావంటున్నారు పిల్లలు. ఆరోగ్యం కూడా చూసుకోవాలి కదా! ఒక్కదానివీ, రెండు రకాల బాధ్యతలు ... జీతంలేని సంసారం పనీ, జీతం బత్తెం ఎంతైనా పగలూ, రాత్రీ కష్టపడాల్సిన ఆఫీసు పని. విసుగనిపించటం లేదూ? ఎప్పుడైనా పిల్లల్ని తీసుకుని తిరుపతికి రావచ్చు కదా! దూరమా, భారమా?" నిష్ఠూరంగా అన్నాడు ప్రభు.

"పని నాకు విసుగనిపించదు. పైగా, ఎంత పనుంటే అంత మంచిదనిపిస్తుంది. ఆలోచించటానికి మనిషికి వ్యవధి ఉండకూడదు. లేకపోతే పిచ్చెక్కిపోతుంది."

"మరి పిల్లలు? వాళ్లు నిన్ను మిస్ అవుతారు కదా!"

"ఏమో! అవుతారని నాకైతే అనిపించటంలేదు. అమ్మ లేకపోతే మరీ హాయి వాళ్లకి. పిల్లలమీదే ప్రాణాలు పెట్టుకుని, వాళ్లు ఎక్కడ తండ్రి లేడని బాధపడతారో అని అడిగిందల్లా కొనిపెట్టి, వాళ్లు బెంగపడతారని నేను బెంగ పెట్టుకుని .... ఇదంతా చూస్తూంటే చివరికి వాళ్లు బాధ్యత లేకుండా పెరుగుతున్నారని నాకనిపిస్తోంది. పక్కవాళ్లింట్లో ఎవరికైనా చీమ కుడితే పరుగెత్తుతారు కానీ, అమ్మ కష్టపడి సామాన్లు మోసుకొస్తుంటే చీమంతయినా చలించరు. లేస్తూనే టేప్ రికార్డరు ... పగలు స్కూలు, రాత్రి టీ.వీ. ... కొంచెం పొరపాటున అప్పుడప్పుడూ చదువు ... ఇదీ వాళ్ల రొటీను. నా గురించి వాళ్లకేమీ బాధలేదు. వాళ్లు ఎలా ఉన్నా, నేను చేయవలసిందంతా చేస్తానని ధైర్యం వాళ్లకి. చెయ్యకుండా వాళ్ల ఖర్మానికి వాళ్లని వదిలివెయ్యగల నిర్లిప్తత నాకు లేదు. చిన్నచిన్న పనులు కూడా - వాళ్ల పనులు వాళ్లు చేసుకోరు. చేసుకోలేకా కాదు, తట్టదు, అంతే! చెప్తే కోపం. చిన్నవాడు మరీనూ, ఎదురు తిరిగి తిడతాడు. సరేలే .... ఈ సోది రోజూ ఉండేదే! నీ కెందుకీ బాధలు చెప్పుకోవటం ...! నువ్వెలా ఉన్నావు? ప్రమోషన్ గొడవ ఏమైంది? ట్రాన్స్‌ఫరు అవుతుందంటావా? హైదరాబాదు ట్రాన్స్‌ఫర్ చేయించుకోకూడదూ, కొన్నాళ్లు మాకూ, మీకూ కూడా కాస్త మార్పు!"

"రావాలనే ప్రయత్నం. వచ్చిన చిక్కేమిటంటే, మనలాంటివాళ్లకి గాడ్ ఫాదర్స్ ఉండరు. నాన్నేమో ముక్కుకి సూటిగా ఆలోచించటం నేర్పటమే కాకుండా, ఎన్ని వక్ర మార్గాలుంటాయో కూడా తెలియకుండా పెంచాడు. ఇన్నేళ్లు వచ్చినా, నలుగురిలో తిరిగి పనులు చేయించుకోగల లౌక్యం అలవాటు పడలేదు. అందుకే ఎక్కడ వేసిన గొంగళి అంటే అక్కడే ఉంది జీవితం!" ప్రభు నిరాశగా అన్నాడు.


"సర్లే, అలా నిరాశపడకూడదు. టైమొచ్చినప్పుడు అన్నీ అవుతాయి. నీకు ప్రమోషన్ రాలేదని అలా అనుకుంటున్నావు గానీ, వక్రమార్గంలో వంద రూపాయలు సంపాదిస్తే నిద్రపోలేని సంస్కారాలు మనవి. ప్రమోషన్ కోసం లంచాలివ్వడం దేవుడెరుగు, అందుకే మనం రాత్రిళ్లు హాయిగా నిద్ర పోగలుగుతున్నాము. ఉన్నదేదో తృప్తిగా తినగలుగుతున్నాము. ఈ ఆస్తి మన పిల్లల కివ్వగలిగితే చాలు. ఈ పట్నవాసాల్లో పిల్లల్ని చూస్తూంటే ఉద్యోగాలతో పొట్ట నింపుకోవాల్సిందే కానీ, పెద్ద ఆస్తులు లేవు. ఎన్ని మార్కులు వచ్చినా దిక్కు లేని ఈ రోజుల్లో తక్కువ మార్కులొస్తే దిక్కే లేదు. అందరూ సంపాదించి సుఖంగా ఉంటే మనం ఎందుకు అలా లేమూ అని వాళ్లకి అనిపిస్తుంది!"

"ఆఁ, ఈ కాలం పిల్లల దృష్టిలో అమ్మలు, నాన్నలు యూనివర్సల్ చవటలు! మనమూ మన తల్లిదండ్రులని చాదస్తులని అనుకునేవాళ్లం గానీ, ఇలా తారెత్తేటట్టు మొహంమీద చెప్పలేదు ఎప్పుడూ!" నవ్వుతూ అన్నాడు ప్రభు.

"బాగా చెప్పావు!" అంటూ వంటింట్లోకి నడిచింది శారద. వెళ్తున్న ఆమెకేసి సాలోచనగా చూస్తూ అనుకున్నాడు 'డైరెక్టుగా అడగకూడదు. తిరకాసేమిటో కనిపెట్టాలి. పిల్లలెప్పుడూ ఇలా విమర్శించలేదు!'

000

మర్నాడు అందరితోపాటు ఇంట్లోంచి బయటపడ్డాడు. ఆఫీసులో పని చూసుకుని విశ్వం వాళ్ల ఊరెళ్లే బస్సెక్కాడు. ఎక్కువ



వెతకక్కరలేకుండానే ఇల్లు దొరికింది. బస్సు దాదాపు వాళ్లింటి ముందే ఆగింది.

వీధి వాకిట్లో ఎండపొడన కుర్చీ వేసుకుని ఒక బుంగమీసాల పెద్దాయన కనిపించాడు. పచ్చటి పసిమి రంగు ... గోల్డ్ ఫ్రేమ్ కళ్లద్దాలు. సాత్వికంగా చూసే కళ్లు, శాంతమైన వర్చస్సు ... చూడగానే గౌరవం కలిగేటట్లు ఉన్నాడాయన. కుర్చీలో ప్రశాంతంగా కూర్చుని నమకం పఠిస్తున్న ఆ వ్యక్తి ప్రభుని చూస్తూనే ఆపేసి, "ఎవరు బాబూ? రండి. ఎవరు కావాలి?" అడిగాడు.

"భుజంగరావుగారు ..."

"నేనే!"

"నమస్కారం. నా పేరు ప్రభు. హైదరాబాదు నుంచి వస్తున్నాను, మిమ్మల్ని కలుసుకోవాలని!"

"సైదులూ! మంచి నీళ్లు పట్రా! రండి, కూర్చోండి!" ఆహ్వానించాడాయన. నీళ్లు తెచ్చిన సైదులుకి కాఫీ తెమ్మని పురమాయించాడు.

"నేను వచ్చిన పనేమిటో వివరించే ముందు, కొంచెం బాక్‌గ్రౌండ్ చెప్పాలి. మీ అబ్బాయి విశ్వం పనిచేసే ఆఫీసులోనే మా వదిన ... నాకు వదిన, స్నేహితురాలు, హితురాలు ... అన్నీ! ... అయిదేళ్లయింది. మా వదినని పిల్లల్నీ వదిలేసి- మా అన్నయ్య హఠాత్తుగా ప్రమాదంలో చనిపోయాడు. అప్పటినుంచి ఎవరి సహాయం అర్థించకుండా స్వతంత్రంగా ఉద్యోగం చేస్తూ పిల్లల్ని పెంచుకు వస్తోంది. తన ధైర్యం అన్నా, వ్యక్తిత్వం అన్నా నాకు చాలా ఇష్టం. పిల్లలంటే ప్రాణం మా వదినకి. అలాంటిది మమ్మల్ని పట్టించుకోవటంలేదు అని పిల్లలూరికే బెంగపెట్టుకుపోతున్నారు. నాకు ఉత్తరం రాశారు ఇద్దరూ కలిసి. ఆఫీసులో విశ్వం అని ఒక అంకుల్ చేరాడు. అమ్మ అతనితో పనిలో పడి అసలు ఇంటికి వచ్చాక కూడా మాతో మాట్లాడటం మానేసింది. పక్కింటత్తయ్యగారు ఏంటేంటో అన్నారు అంటూ. నేను వెంటనే వచ్చాను. నిన్న మీ అబ్బాయిని మొదటిసారి చూశాను. మీతో అయితే నాకు పరిచయమే లేదు. అయినా సాహసించి వచ్చాను. నేను ఇక్కడికి వచ్చేముందు మీతో ఏం మాటలాడాలో ఏమీ అనుకోలేదు. పిల్లల గురించిన ఆదుర్దా తప్ప, మరేమీ లేదు. మీలో ఏదో వర్చస్సు నాకు మరేం భయపడాల్సిన పనిలేదని ధైర్యం కలిగిస్తోంది. దయచేసి నా ఈ రాకను మన్నించండి!" అంటూ ఆపుకోలేనట్లుగా తన ఆవేదననీ, ఆరాటాన్నీ అంతకు మునుపెన్నడూ చూడని వ్యక్తిముందు, తన స్వభావానికి విరుద్ధంగా వెళ్లబోసుకున్నాడు.

ఆ పెద్దాయన, పేరు భుజంగరావు. అంతా విన్నాడు నిశ్శబ్దంగా, ముఖంలో ఏ భావమూ కనిపించనీయకుండా చిరునవ్వుతో.

"శారదమ్మ నాకు కూడా తెలుసు. విశ్వం నాకంతా చెప్పాడు. మీరనుకుంటున్న ప్రమాదమేమీ ఆ అమ్మాయికీ, పిల్లలకీ లేదు. మీరింటికి వెళ్లండి. రేపు సాయంత్రం నేనూ, మావాడూ మీ ఇంటికి వస్తాం. రేపు ఆదివారమే కదా, మీకేమీ ఇబ్బంది లేదు కదా? అయితే ఇప్పుడే ఇంట్లో ఏమీ చెప్పకండి ఎవరికీ! శారద ఊరికే హడావుడి పడిపోతుంది అనవసరంగా! మా వాడితో నేను మాట్లాడతాను! మీరు వెళ్లండి!"

ప్రభు ప్రశ్నార్థకాలు ఎన్ని ఉన్నా ఒకరకమైన నిశ్చింతతో ఇంటి దారి పట్టాడు.

000

మర్నాడు అందరూ టీ.వీ. సినిమా చూస్తూ ఇంట్లోనే ఉన్నారు. మామూలుగా పరీక్షలు దగ్గరపడుతున్నా పిల్లలు టీ.వీ. చూస్తే శారదకి పిచ్చి కోపం వచ్చేది. ఇప్పుడు నిర్వికారంగా హిందూ పేపర్ మాగజైన్ సెక్షన్ చదువుతూ అక్కడే కూర్చుంది. ఆ రోజు చాలా రోజుల తర్వాత ప్రభు వెనకాల వెనకాల తిరుగుతూ కబుర్లు చెప్తుంటే వింటూ వంట పూర్తి చేసింది. పాత రోజులు గుర్తుకు తెచ్చుకుంటూ ఒకరకమైన ఉత్సాహంతో జరిపింది.

విశ్వం లోపలికి వచ్చాడు. ప్రభువైపు చూసి నవ్వుతూ, "నమస్తే!" అని చెప్పి, శారదకేసి తిరిగి, "పేపరు చదువుతున్నారా, టీ.వీ. చూస్తున్నారా?" అని అడిగాడు.

"రెండు!" అంది శారద నవ్వుతూ.

ముఖాలు ముడుచుకుని పిల్లలిద్దరూ లోపలికి వెళ్లారు. "ఈ రోజు పొద్దున్న నేను, నాన్న యాదగిరి గుట్టకెళ్లాం. మీకోసం ఒకటి తెచ్చాను. చూడగానే కొనాలని అనిపించింది. మీరే గుర్తుకు వచ్చారు!" వెండి తాపడం చేసిన నృసింహస్వామి విగ్రహం తీసి టెబుల్ మీదపెట్టాడు.

"నాకా! ఈ బహుమతి నాకా! ఉన్నట్టుండి ఈ గిఫ్ట్ ఎందుకు? ఏమన్నా అకేషనా?" సీరియస్‌నెస్ శారద గొంతులో. "విశ్వం! నేనెవర్నీ ఎప్పుడూ అంత దగ్గరకి రానీయను. కానీ నువ్వెలాగో ప్రవేశించావు. ఎప్పుడూ ఏదో ఒక హడావుడీ సృష్టిస్తూనే ఉంటావు. మొన్నటికి మొన్న హరిద్వార్ నుంచి స్ఫటికమాల, మధ్యలో చీర .... ఇప్పుడు మళ్లీ ఇది! నేను ఇవేమీ వాడను. నీకు తెలియదు, నాకు బాగుండదు ఇలా తీసుకోవడం! ఎందుకు అసలు నువ్వు నా కోసం గిఫ్ట్లు తేవాలి?" నిలదీసింది శారద గంభీరంగా.

"చెప్పానుగా, నాకెందుకివ్వాలనిపిస్తోందో! మీరు వయసులో అంత పెద్ద కాకపోయినా, మీ వయస్సులో మా అమ్మ ఇలా ఉండిఉండేదని నాకనిపిస్తుంది!" నెమ్మదిగా, ఓడిపోయినట్టు లో గొంతుకతో అన్నాడు విశ్వం.

"నిజంగానా? అయితే విను, తల్లిగా స్త్రీని చూసే దృష్టికీ, తల్లి దృష్టికీ అందాలూ, అలంకరణలూ, బహుమానాలూ అక్కరలేదు. విశ్వం! ఏమీ అనుకోకు. ఖచ్చితంగా చెప్పటం నా అలవాటంతే!" కబోర్డులోంచి మాల, చీర పాకెట్టు, అప్పుడు తెచ్చిన విగ్రహం పక్కన పెడుతూ మళ్లీ అంది "నీ కాబోయే భార్యకివ్వు పోనీ!" అంది కొంచెం నవ్వుతూ, కొంచెం గంభీరంగా.


విశ్వం ముఖం చిన్నబోయింది. ప్రభు కూడా తెల్లబోయాడు "వదినా! ..." అంటూ ఏదో చెప్పబోయాడు. భుజంగరావుగారు ప్రవేశించడంతో ఆగిపోయాడు.

"నమస్కారమండీ! రండి!" తడబాటుతో ఆహ్వానించింది. "మంచినీళ్లు తెస్తాను!" అంటూ లోపలికి నడిచింది. ఆమె లోపలికి వెళ్లగానే విశ్వంకేసి చూస్తూ సర్వాంతర్యామిలా నవ్వాడాయన. విశ్వం మొహం పాలిపోయింది.

భుజంగరావుగారు శారద తెచ్చిన మంచి నీళ్లందుకుంటూ, "పిల్లలేరమ్మాయ్! పిలు, వాళ్లని!" అన్నారు.

శారద "చదువుకుంటున్నారేమో!" అంటూ, "రజనీ! ప్రసన్నా! ఇలా రండొకమాటు!" అని పిలిచింది.

ఇద్దరూ వచ్చారు. రజని కళ్లు చూస్తూనే ఏడుస్తున్నట్టు తెలుస్తూనే ఉంది. ప్రసన్న



సిగ్గుపడుతూ తల్లి పక్కన నుంచున్నాడు.

"ఇలా రండి ఇద్దరూ!" ఇద్దర్నీ తలోవైపూ కూర్చోబెట్టుకున్నారు. "అమ్మ మిమ్మల్ని పట్టించుకోవడంలేదని బెంగెట్టుకున్నారు, అవునా? రండి, మీ ఇద్దరికీ ఒక కథ చెప్తాను. మీలాంటి ఒక వె(త్రి)కన్న నాకూ ఉన్నాడు. ఇడుగో, ఈ విశ్వం! ఇది విన్నాక వీణ్ణి చూసి మీరు ముఖం ముడుచుకోరు. మీ అమ్మ వీడితో మాట్లాడితే మీ ఆస్తి వీడు దోచుకున్నాడని బాధపడరు. పైగా వీణ్ణి భయ్యా అని పిలుస్తారు, సరేనా!

"మీకూ మీ నాన్న పోయినట్లే, వీడికీ వీళ్లమ్మ పోయింది చాలా చిన్నప్పుడు. అసలు వీడికి వీళ్లమ్మ గుర్తుకూడా లేదు. కానీ హాస్పిటల్‌లో మీ అమ్మ బాధ చూశాడు. అసలు గుర్తులేని అమ్మే ఉంటే ఇలా ఉండేదేమో అనుకున్నాడు వాడు. గుండెల్లో ఈ భావం నాటుకుపోయింది. మీకు సాయంత్రం మీ అమ్మని చూడటానికి వచ్చేవాళ్లు కదా! అప్పుడు అమ్మని ఫ్రెండ్స్‌తో పార్టీ ఉంది డబ్బులియ్యమనో, నా ఫ్రెండ్ జీన్స్ కొనుక్కున్నాడు నాకూ కావాలనో ఏదో ఒక డిమాండ్ అడుగుతూ ఉండటం చూశాడు. 'అమ్మా! నీ కాలెలా ఉంది?' అని మీరు అడగటం వాడు వినలేదు. ఇలాంటి అమ్మ నాకుంటేనా .... అనుకుంటూ పోయాడు. అడిగినా అడక్కపోయినా అన్ని రకాల సహాయాలూ చేశాడు. ఇందులో వాడి తప్పుందా అంటే నాకు తెలియదు. ఒకటి మాత్రం చెప్పగలను. లేని అమ్మ ఉంటే ఎలా ఉండేదో అని ఆలోచిస్తాడు కానీ, అమ్మ లేని లోపం తెలియకుండా తనని పెంచటానికి నాన్న ఎంత తిప్పలు పడ్డాడో ఆలోచించడు. అమ్మ మీ గురించి పట్టించుకుని అడిగినన్నాళ్లూ ఆవిడ మీకు ఒక నాగింగ్ మిషన్‌లా కనిపించేది. తను విరక్తిపడిపోయి, మీ నుంచి విడిగా తన జీవితం ఏర్పరచుకునేలా మీరే చేశారు. మా వాడూ అంతే! అయితే, మీ అమ్మ మిమ్మల్ని వదిలెయ్యలేదు. మీరు చూపలేకపోయిన అభిమానాన్ని విశ్వం చూపిస్తుంటే నా స్వంత పిల్లలు ఇలా ఎందుకు లేరు అని విరక్తి పెంచుకుంటోందంతే! కానీ నిజంగా స్వంతమే అనుకుని మావాడు చిన్న బహుమానాలిస్తే ఎలా రియాక్టయిందో చూశారుగా ... మీ అమ్మకి ప్రేమించే పిల్లలు కావాలి. మీకు, మా వాడికి లాలించే అమ్మ కావాలి. అన్నీ మన చేతుల్లో ఉండవుగా! మావాడికి అతిగా అనుబంధం పెంచుకోవద్దని పదిసార్లు చెప్పాను. అమ్మలాంటి ఆంటీ తనకి కావాలనుకున్నాడంతే! పెద్దవాళ్లయినా, చిన్నవాళ్లయినా, మనిషి చేసే ప్రతి పని వేనకా ఒక మానసికమైన ప్రెషర్ ఉంటుందంతే! నిన్న మీ బాబయ్య మా ఇంటికి వచ్చారు. వాడికి మళ్లీ చెప్పాను. వాదించాడు. వాడికి పాయింట్ అర్థమయ్యేలా చెప్పటానికి ఈ పథకం వేశాను. ఎంతైనా విశ్వం పరాయివాడే కదా! ఆవిడ తను గీసుకున్న గీటు దాటదు. అది ఇప్పుడు అర్థమయ్యే ఉంటుంది!" ఆయన నిర్వేదంగా ముగించారు. ఆ అపూర్వ మానసిక విశ్లేషణ అందరినీ స్తబ్దుల్ని చేసింది.

ప్రభు ఒక్కసారి లేచాడు. విశ్వం చెయ్యిపట్టి లాగి కౌగలించుకున్నాడు. "తప్పు చేశాను, బ్రదర్! మా పిల్లలేదో భయపడితే వాళ్లతో సమానంగా నేను ఖంగారుపడ్డాను. మా వదిన నీకు అమ్మే! పిల్లలూ! ఇది నా ఆర్డర్! వినండి! పక్కింటత్తయ్యల్ని వాళ్ల ఖర్మానికి వదిలెయ్యండి. అమ్మని విసిగించకుండా మీ పనులు మీరు చేసుకుంటూ కొంచెం సాయం చేయండి. మరీ మిషన్‌లా చూడకండి. అమ్మ లేకపోవడమంటే ఏమిటో విశ్వాన్ని అడగండి చెపుతాడు!"

పిల్లలిద్దరికీ ఎక్కిళ్లు ఆగటంలేదు. శారదకి తన తప్పు తెలిసింది. 'తన ప్రవర్తన తన వెనకాల ఇంత కథ నడిపిందా!' పిల్లల్నిద్దరినీ దగ్గరకి తీసుకుంది. "సహాయం చెయ్యలేదని అంటాను కానీ, నిజంగా మీరు సహాయం చెయ్యవలసిన అవసరం నాకేమిటి? ఏదో అప్పుడప్పుడూ అలా కోపం వస్తుందంతే!" ఒక్క నిమిషం విశ్వంకేసి చూసింది. కళ్లల్లో నీళ్లు నిండాయి. అయినా నవ్వుతూ చెప్పింది, "విశ్వం! ఈ విగ్రహం, ఈ చీరా, ఈ మాలా అన్నీ నాకే! నీ భార్యకి నేను మళ్లీ కొనిపెడతాలే!"

విశ్వం తండ్రికేసి చూశాడు. "డాడీ! థాంక్స్! ఈ కనువిప్పు నాకే కాదు, మీ పట్ల నా అంధత్వాన్నీ పోగొట్టారు!" సిగ్గుతో క్షమార్పణ నిండిన గొంతుకతో అన్నాడు.

"ఆల్ ఈజ్ వెల్ దట్ ఎండ్స్ వెల్! అమ్మంటే .... అమ్మే! అలాంటి మరొక జీవి లేదు ప్రపంచంలో ..." ఆయన అంటూంటే అందరి ముఖాల్లో విచ్చుకున్న మబ్బుతెరలు, ఒక్క వ్యక్తి సదవగాహనతో! ■

## సరస'రసం'ఎక్కువే!



తెలుగువాళ్లు పొగడ్తలకు లొంగిపోతారని అంజలా జవేరి అప్పుడే గ్రహించేసినట్టుంది...తెలుగువాళ్లకి రసదృష్టి ఎక్కువని బాజాలు వాయించడం మొదలుపెట్టింది. 'ప్రేమించుకుందాం రా!', 'చూడాలని ఉంది' సినిమాల్లో తనను చాలా అందంగా చూపించారని సంబరపడుతోంది. ఆ సినిమాలు చూశాక తనకే ఆశ్చర్యమేసిందట. "నేను ఇంత అందంగా ఉంటానన్న విషయమే నాకు తెలీదే" అనుకుందట.

అంజలా ఎంత అదృష్టవంతురాలు కాకపోతే తెలుగులో ఈమె నటించిన మూడు సినిమాలూ వరుసగా వందరోజులు ఆడతాయి?!

ఈమెను పెట్టుకుంటే సక్సెస్ వరించడం ఖాయమనే ఆలోచనలో మన నిర్మాత లున్నారుమరి.

-వల్లి

